

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

**నెల దాదాపుగా** గడిచిపోయింది ఏలూరులోనే. తాతగారి అంత్యక్రియలు పెద్దకర్మ అయిపోయేదాకా నేనూ అమ్మా అక్కడే వున్నాం. ఎటొచ్చీ నాన్న అర్జంటుగా వెళ్ళాల్సివచ్చినప్పుడు మాత్రం వెళ్ళి, మిగతా సమయమంతా మాతోనే ఏలూరులోనే ఉన్నారు. "మీ అమ్మ మౌనం చూస్తుంటే నాకు బాధగా వుందే సీతా. తల్లిదండ్రులు ఇద్దరూ లేకపోవడం ఎంత బాధాకరమైన విషయమో నాకు తెలుసు." నిట్టూర్చి నాతో అన్నాడు నాన్న. నేనూ అమ్మని గమనిస్తూనే వున్నాను. భద్రావతి అత్త తల్లి ఐరావతి కూడా ఇక్కడే వుంది. ఆవిడ 'రాజకీయాలు' చేయడం అందరూ గమనిస్తునే వున్నారని నేనూ గమనించాను.

"బావా.. ఇప్పుడో రేపో అన్నట్టుగా వుంది పరిస్థితి. ఇక వేర్లుపడక తప్పదేమో!" విచారంగా మా నాన్నతో అన్నాడు మా పెద్దమామయ్య. నిజంగా ఆయన ధర్మరాజే. ఆయన తమ్ముళ్ళూ, నకుల సహదేవులే.

"అదేదో అటువైపు నించే రానివ్వండి బావగారూ. మీరు ఏ విషయమూ ఎత్తకండి. మిగతా వాళ్ళ సంగతి అనవసరం. మీ తమ్ముళ్ళు బాధపడతారనేది ముమ్మాటికీ నిజం. వాళ్ళు చాలా మంచివాళ్ళూ, మీ మీద భక్తి కలిగిన వాళ్ళూ" అన్నాడు మా నాన్న. ఆ మాట నిజమే. చిత్రం ఏమంటే అదివరకు ఏదో ఓ మాట అని ఎప్పుడూ నన్ను ఏడ్పించాలని చూసే వాసు, ఈ పాతికరోజుల్లోనూ ఎంతో ఎదిగినట్లు నాకు అనిపించింది. ఎంతపని చేశాడో మావయ్యలు కార్యక్రమాల్లో వుంటే, కావల్సినవన్నీ తేవడమేనా, బంధువులకి కబురంపటమేనా, వచ్చినవారికి సకల సౌకర్యాలు సమకూర్చడమేనా, ఎంతో అనుభవం వున్నట్టు పనిచేశాడు. అతనికి వాళ్ళ నాన్న మా పెద్దత్తా సలహాలు ఇవ్వడం వేరు. కానీ, చెప్పిన పనిని సక్రమంగా చెయ్యాలంటే 'సమర్థత' కావాలిగా.

అంతేకాదు.. నాతోటి అతని ప్రవర్తన కూడా చాలా గౌరవనీయంగా వుంది. ఆడవాళ్ళు 'పెద్దమనిషి' కావడం ఓ ప్రకృతి ధర్మం. అది అందరికీ తెలుస్తుంది కూడా.

మగవాళ్ళు 'పెద్దమనుషులవడం' ఎవరికీ తెలియదు, ప్రవర్తనతో తప్ప. నాకైతే వాసు చాలా ఎదిగినట్లనిపించింది. బస్సు బయలుదేరింది. తడికలపూడి దాటంగానే తమ్మిలేటిగాలి చల్లగా తగిలింది. ఎక్కడెక్కడి మేఘాలూ ఆకాశాన్ని కప్పివేశాయి. మెరుపులు - వాటికి తోడుగా ఉరుములు. అతి సన్నటి చినుకులు బస్సుటాపు మీద పడి సవ్వడి చేస్తున్నాయి. నాకెందుకో కన్నీళ్ళొచ్చాయి. తాతయ్యా అమ్మమ్మ ఆశీస్సులా యీ చినుకులూ.

అమ్మ నిర్వికారంగా ఎడమ చేతివైపు పరుచుకున్న తమ్మిలేటిని చూస్తోంది. మా నాన్న అమ్మని చూస్తూ "అటుచూడు.. మనిషి బతుకూ ఆ ఏటిలాంటిదే ఒక్కోసారి నిండుగా ప్రవహిస్తూ, మరోసారి కట్టెలా ఎండిపోతూ.. ఎన్నెన్ని మలుపులో!" అన్నాడు.

బస్సు 'విజయరాయి' చేరింది. వర్షం ఉధృతమైంది. "వర్షం కాస్త ఆగితేగానీ బస్సు కదల్దండీ. రోడ్డు మీద గోతులు మరీ ఎక్కువగా వున్నాయి. బస్సు 'వైపర్లు' పనిచెయ్యడంలేదు" విషయం చెప్పాడు కండక్టరు.

కొందరు గబగబా దిగి పక్కనే వున్న టీ కొట్టు పాకలోకి పోయి టీలు ఆర్డరేస్తే మరికొందరు బీడీ సిగరెట్టు ముట్టించుకున్నారు. చూస్తుండగానే వర్షం పెద్దదయింది. మౌన వర్షం, మూగ వర్షం.. మనో వర్షం.

మా ఊరు చేరేప్పటికి చీకటి పడింది. కారణం బస్సు టైర్లకి పంక్చరవ్వడమే. స్పేర్ టైర్లో గాలిలేదట. మొత్తానికి ధర్మాజీ గూడెంలో పంక్చరు వేశారు. వర్షం దెబ్బకి అప్పటికే రెండుగంటలు లేటయ్యింది.

రిక్షాలో ఇంటికెళ్ళాం. నడిచే వెళ్ళొచ్చు. కానీ అమ్మ రిక్షాలో వెళ్దామన్నది. ఆమాట అనంగానే అమ్మ మొహం చూశాను. భయంకరమైన నీరసం ఆ మొహంలో తాండవిస్తోంది. అన్నం సరిగ్గా తింటేగా!

మేం రావడం చూసిన కరణం మామ్మగారు, "వచ్చారుటే తల్లీ.. మనుషులకి రావల్సిన కష్టం కాదమ్మా.. కాస్త కాళ్ళూ, మొహం కడుక్కోండి. వంట చెయ్యొద్దు వేడిగా కాస్త పప్పూ చారూ మజ్జిగా పట్టుకొస్తా" అంటూ మమ్మల్ని అలతి అలతి పదాలతో ఓదార్చింది. ఎప్పటికప్పుడు మా నాన్నని ఆవిడ అన్ని విషయాలూ అడిగి తెలుసుకుంటూనే వుందిట. ఆ విషయం మా నాన్న తరవాత చెప్పాడు.

ఆ రాత్రి ఏదో తిన్నామనిపించి పడుకున్నాం. దాదాపు నెలరోజులు.. ఇంటికి దూరంగా.. మృత్యువుకి దగ్గరగా మృత్యురాణి విన్యాసాల్ని గమనిస్తూ, లౌక్యపు ముసుగులను పరిశీలిస్తూ, జీవితగమనాన్ని పరిశోధిస్తూ..

కుక్క అరుపు. తలుపు తీసి చూస్తే 'ఇంతెత్తున' పెరిగిన మోతీ. మేం వెళ్ళేముందే దాన్ని ముత్యాలోడి ఇంట్లో వప్పజెప్పాను.

మేం వచ్చామనే విషయం దాని కెవరు చెప్పారో! అది ఎగిరెగిరి నా చుట్టూ తిరిగి, విశ్వాసం ప్రకటించి సూటిగా మా అమ్మ దగ్గరికి పోయి ఆవిడ చెయ్యి నాకడం మొదలెట్టింది.

మోతీ అంటే ఎంత ఇష్టమైనా మా అమ్మ దాన్ని దగ్గరికి రానీయదు. రానిచ్చేది కాదు. 'మడి' చెడుతుందని. కానీ ఇప్పుడు మాత్రం దాని తలనిమురుతోంది. మోతీకి ఏమయిందో ఏమి అర్థమయిందో తెలీదుగానీ ఆవిడ చుట్టూ తిరుగుతూ, చీర చెంగు నోట కరుచుకుంటూ ఏడుస్తూ మీద మీదకి వెడుతూ, తన ప్రేమనో అభిమానాన్నో ప్రదర్శిస్తోంది.

లోకం ఎంత చిన్నదీ, ఎంత పెద్దదీ, ఎంత విచిత్రమైనదీ, ఎంత అర్థంకానిదీ!

చివరికి అది మా అమ్మ పాదాల దగ్గర చేరి పడుకుంది.

రాత్రంతా కలత నిద్రే ఏవేవో కలలు. ఎవరెవరో వ్యక్తులు. వాళ్ళెవరూ నిజజీవితంలో తెలిసినవారుకారు. దొర్లుతూ పడుకున్నా. మళ్ళీ ఉరుములు మెరుపులు.. వర్షం.

వర్షపు సవ్వడే ఆ రాత్రి నాకు జోలపాటగా మారి నిద్రలేచేసరికి బారెడు పొద్దెక్కింది.

అసలు మనిషి ఎందుకు పుడుతున్నాడూ.. ఎందుకు అస్తమిస్తున్నాడూ? యీ బంధాలు యీ చుట్టరికాలూ ఎందుకూ? చదువులూ సంపాదనలూ, కక్షలూ కార్పణ్యాలు, సన్మానాలూ, సంతాపాలూ, పొగడ్తలూ తెగడ్తలూ ఇవన్నీ ఎంతసేపూ? కన్ను మూసేంతవరకేగా. చనిపోయిన మరుక్షణం ఏదీ అంటదు.

నిన్నటిదాకా సుబ్బారావుగారూ అనో, దశరథరామయ్యగారూ అనో పిలిచినవాళ్ళే, మరణించిన మరుక్షణం "ఏమండీ బాడీని ఇంటికి తెచ్చారా, హాస్పిటల్లోనే వుంచారా?" అంటారు. అంటే ఫలానా పద్మభూషణ్ etc,etc,etc బిరుదులేకాదు, పెట్టిన పేర్లూ పెట్టుకున్న పేర్లేకాదు, పుట్టినప్పుడు పెట్టిన పేరు కూడా 'హుష్ కాకి' అయిపోతుంది. మరెందుకీ తాపత్రయం

ఇప్పుడయితే అప్పటి నా మనసుని విశ్లేషించి రాస్తున్నానుగానీ, ఆనాడు బారెడు పొద్దెక్కిన ఆ రోజున నా మనసులో వున్నది కేవలం మౌనం మాత్రమే. అమ్మ తెల్లని తెల్లవారు ఝామునే లేచి వంట చేసేది కాస్తా, ఆ రోజు పక్కమీద అటూ ఇటూ దొర్లుతూనే వుంది.

నేనే తనని లేపాను. కాఫీ నేనే పెట్టి ఇచ్చాను. నెలరోజులుగా వాళ్ళిద్దరికీ కాదు, నాకూ సరైన తిండిలేదు. అందుకే సైకిలేసుకెళ్ళి మా కృష్ణయ్య హోటల్నించి వేడివేడీ ఇడ్లీలూ చెట్నీలూ, కారప్పొడీ పూరీ కూరా తెచ్చాను. దిట్టంగా నెయ్యీ జీడిపప్పులూ వేసి ఇంట్లో ఉప్మా చేశాను. చింతపండు పచ్చడి చేశా. వేరుసెనగ పచ్చడి కూడా చేశా. కృష్ణయ్య ఇచ్చిన కొబ్బరి, అల్లం పచ్చళ్ళు ఉండనే వున్నాయి కదా!

చక్కగా అరిటాకుల్లో అన్నీ వొడ్డించి ఇద్దరి చేతా తినిపించాను. వాళ్ళు తినకపోతే నేను తిననని గొడవ పెట్టడం వల్ల వాళ్ళు మాట్లాడకుండా భోజనంలాంటి టిఫిన్‌ని మౌనంగా తిన్నాక, నేనూ తిన్నాను.

"మా అమ్మే మళ్ళీ నీలా పుట్టిందే" తృప్తిగా తిన్నాక మా నాన్న అన్నాడు. ఒక్క భారతీయుల్లో తప్ప బిడ్డల్లో తమ తల్లిదండ్రుల్ని చూసుకోవడం మరెక్కడా వుండదనుకుంటా. అందుకే, మరణించిన తల్లిదండ్రుల పేర్లను తమ పిల్లలకో, మనవలకో పెట్టేది.

నాన్న కోర్టుకి వెళ్ళిపోయారు. అమ్మ దిగాలుగా కూర్చుంటే అడిగాను. "అమ్మా చనిపోయినవాళ్ళు తిరిగిరారని నాకు ధైర్యం చెప్పాల్సింది పోయి, నువ్వు దిగులు పడటం రైటా?" అన్నాను. ఎల్లప్పుడూ సానుభూతి వాక్యాలు పలకడం సరికాదని నాకు అనిపించే కొంచెం కఠినంగా మాట్లాడాను.

"మా అమ్మా నాన్నా పోయారన్న చింతకాదే. వాళ్ళు అదృష్టవంతులు. నిజంగా మా నాన్న బ్రతికి వుంటే ఆయన ఆలనా పాలనా వాళ్ళందరూ చూడగలరా? సీతా, భర్త పోతే భార్య ఎట్టాగొట్టా బతగ్గలదు. పిల్లలు తిట్టినా తిమ్మినా పెద్దగా బాధపడదు. కారణం బిడ్డల తన్నులు వాళ్ళు కడుపులో వున్నప్పుడే భరించడం వల్ల కావచ్చు. కానీ, భార్య ముందు పోతే, ఆ భర్త బతుకు నిజంగా నరకమేనే! మగవాళ్ళకి అభిమానం ఎక్కువ. 'ఇది కావాలి' అని ఏనాడూ అడగలేరు. ఎవరో ఎందుకూ, మీ నాన్న నోరు తెరిచి యీనాటివరకూ 'ఇదిగో భాగ్యం, నాకు ఇది చేసి పెట్టు' అని ఏనాడూ అడగలేదు. నేను కనిపెట్టుకుని చూడటమే! మీ నాన్న అంతటి మెతక మనిషి లోకంలో మళ్ళీ పుట్టడే సీతా. నా బాధ ఏమిటో తెలుసా? నీ దారిన నువ్వు రేపో ఎల్లుండో పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతావు. నేను గనక 'హరీ' అంటే మీ నాన్నని ఎవరు చూస్తారూ? నేను పోయాక నువ్వు పుట్టింటికి వస్తే కనీసం నీకు ఎవరు వొండిపెడతారు? మా అమ్మా నాన్నా వున్నంతవరకు నాకు పుట్టిల్లుందనే ధైర్యం వుండే. ఇప్పుడు నాకా ధైర్యం లేదే. నా సంగతి పక్కన పెట్టు., నా దిగులంతా నీ గురించీ మీ నాన్న గురించీ" అంటూ బొట బొటా కన్నీరు కార్చింది. ఏం మాట్లాడనూ? ఏలూరులో మా అత్తయ్యల మాటలూ వాళ్ళ పుట్టింటి వాళ్ళ మాటలూ విన్నాక 'అమ్మ' ఆలోచన ఏ మాత్రం తప్పుకాదనిపించింది.

"అమ్మా నీకు చెప్పేంతదాన్ని కాను కానీ, రేపటి గురించిన దిగులుతో ఇలా నువ్వు మూగబోతే, ఇవ్వాళ నాన్న ఎంత బాధపడుతున్నానో నీకు అర్థమౌతుందా? ఆలోచించు. రేపు నువ్వు లేకపోవటం గురించికాదు, ఇవాళ నువ్వు వున్నావన్న నిజం గుర్తించాలి కదూ" భుజం మీద చెయ్యివేసి అన్నాను. ఓ నిముషం తరవాత, "ఔనే.. నేనిప్పుడు మీ మధ్యే వున్నాను. ఇక బాధపెట్టను సరేనా?" లేచి నిలబడింది మా అమ్మ.

అప్పుడనిపించింది, వెయ్యి ఓదార్పుల కంటే, ఒక్క 'స్ఫూర్తి' నిచ్చే మాట గొప్పదని. మరొక సత్యం కూడా నాకు అప్పుడు తెలిసింది. నిన్నటికీ, రేపటికీ ఇచ్చే ప్రాముఖ్యతని సాధారణంగా మనిషి 'నేటి'కి ఇవ్వడనీ, కానీ ఇవ్వాల్సింది 'యీనాటి'కేననీ. ఓ మహాపురుషుడు అన్నట్టు నిన్నటిది హిస్టరీ - రేపటిది మిస్టరీ - నిజమైన జీవితం ఈనాటిదీ - ఇప్పటిదీ.

వంటింటి శబ్దాలు చెప్పాయి.. మా అమ్మ సర్దుకుందనీ, మళ్ళీ మనుషుల్లో పడ్డదనీ.

ఎండలు మండిపోతున్నాయి. చెరువులు ఎండి భూమి నెర్రలు విచ్చింది. కానీ మామిడి చెట్లు మాత్రం నిండు చూలాల్లా పూవులతో పిందెలతో కళకళలాడుతున్నాయి. అసలు తంగేడిపూలకి ఆ రంగు నిచ్చినవాడి నడగాలి.. ఆ పొద ఏం లంచమిచ్చిందీ అని!

ఆకులు ఎంత ఆకుపచ్చో, పూవులు అంత పసుప్పచ్చ. ఇహ ఇటుకపొడి రంగే వేరు. పండిన బాదం ఆకుల్ని ఎండబెట్టి ఎర్రని పొడిగా తెచ్చారు. ఎవరూ అంటే, పంబలివాళ్ళు.

కరణంగారి ఇంట్లో పంబలివాళ్ళ చేత 'కథ' చెప్పిస్తారట. వారింట్లో 'సుడిదేవర' కొలుపు వుందని, ఆ ఆచారాన్ని ఇప్పటికీ పాటిస్తున్నారు. మధ్యాహ్నమే పంబలివాళ్ళు కరణంగారింటికి వచ్చి పెద్ద చోటుని చక్కగా ఊడ్చి మళ్ళీ కళాపి చల్లి, కొద్దిగా ఆరాక మళ్ళీ ఊడ్చారు. దానిమీద వస్త్రకాయం పట్టిన పూలపొడులతోనూ ఆకు పొడులతోనూ సుడిదేవర బొమ్మని అద్భుతంగా వేశారు. ఆ రంగుల్ని చూస్తే మతిపోయింది. మనమూ ముగ్గులకి రంగులు వాడతాం. వీరు వేసిన ఆకుపూల పొడుల ముగ్గులముందు మనం వేసే రంగులు ఎందుకూ పనికిరావు. ప్రకృతిలోంచి తయారించిన రంగులముందు కెమికల్ రంగులెందుకు పనికొస్తాయీ.

"అమ్మా.. రాత్రికి వస్తాం.. మీకు తెలుసుకదా!" అని అన్నాడు కథ చెప్పే పెద్దాయన. కరణంగారి భార్యతో.

"తెలుసులే" అంటూ కరణంగారు వాళ్ళకి డబ్బిచ్చారు.

"ఎందుకిచ్చారూ?" అన్నాను నేను.

"వాళ్ళేదో కొంచెం తాగుతారు. అప్పుడే కథ చెబుతారు. ఇవ్వాళ నేనడిగిన కథ ఏమిటో తెలుసా? "మాంధాత" మహారాజు కథ. వినాలనుకుంటే వచ్చెయ్యి." అన్నారు కరణంగారు నాతో.

"ఇది ఇతర్లను అనుమతించే 'విశేషం' కాదు. కానీ, వాడు నిన్ను కూడా రమ్మన్నాడంటే చాలా మంచిదే సీతా. ఇలాంటి కొలుపులు యీ కాలంలో లేవు. మా కుటుంబానికి 'సుడిదేవర' కూడా ఇలవేల్పే?" అన్నది మామ్మగారు.

"ఎర్రానీ మాలచ్చిమికి ఎర్రాగాజుల్లు

తెల్లాని మా యమ్మకి తెల్లా గాజుల్లు" అంటూ

అద్భుతంగా వాళ్ళు ఆ రాత్రంతా, సుడిదేవరను స్తుతించాక 'మాంధాత మహారాజు' కథ చెప్పారు. మధ్యమధ్యలో కాస్త 'వేసుకోవడానికి' ఆగినా, కథ మాత్రం మహా 'పట్టు'గా సాగింది. కొలుపు పూర్తయ్యేసరికి తెల్లవారుఝాము నాలుగున్నర దాటింది.

మళ్ళీ వాళ్ళే ఏవేవో చదివి ముగ్గుని జాగ్రత్తగా ఓ పద్ధతి ప్రకారం తీసివేసి, మళ్ళీ కళ్ళాపిజల్లి, కొన్ని ఆకులు క్రమపద్ధతిలో పెట్టి, "అమ్మా, ఇక మళ్ళీ యీ చోట మీరు మాములుగా తిరగొచ్చు. అయితే, సూర్యోదయం తరవాత మళ్ళీ ఊడ్చి, కళ్ళాపిజల్లి, ముగ్గ వేశాక మాత్రమే" అని జాగ్రత్తలు చెప్పి వెళ్ళారు... సంభావన (?) తీసుకుని. ప్రతి ఒక్కరికీ మర్యాద ఇచ్చిన రోజులవి. కళాకారుల్ని గౌరవించే రోజులవి. ప్రతి 'కళ' బతికి బట్టగట్టిన రోజులవి. ఎన్ని విద్యలో. ఎన్ని సంగీత సాహిత్య ప్రక్రియలో! ఆ రాత్రంతా మెలుకువగానే వున్నా, అలసట అనిపించలేదు. అంతేకాదు. మహోత్సాహం పుట్టుకొచ్చింది.

'త్వరలో ఎస్.ఎస్.ఎల్.సి రిజల్ట్స్ ప్రకటింపబడతాయి' అన్నది పేపరులో వచ్చిన వార్త. అంటే, ఆ ఫలితాలేకాక, అన్ని ఫలితాలు కూడా తొందర్లోనే వచ్చేస్తాయిగా! కుర్రాళ్ళు టెన్షన్‌గా తిరుగుతుంటే, విద్యార్థినులం మాత్రం ధీమాగా తిరుగుతున్నాం. కారణం మగవాళ్ళు సమయాన్ని చాలా వృథా చేస్తారు. మేము చదువుకి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తే, వాళ్ళు ఆటలకీ సినిమాలకీ ప్రాముఖ్యత నిస్తారు. పొద్దున్నే లేవడం పేపరు ఎపుడొస్తుందా అని ఎదురు చూడడం. పేపరు రావాలంటే మాటలుగాదు. ఫస్టుబస్సు మా వూరి నుంచి ఏలూరు వెళ్ళాలి. అక్కడ న్యూస్ పేపరు కట్టల్ని వేసుకుని, ఊరూరా దింపుతూ రావాలి. ఆ డిస్ట్రిబ్యూషనంతా కాశయ్యగారిదే. ఊళ్ళో కొచ్చాక పేపర్లు ఇళ్ళకి (అతి తక్కువ.. అప్పట్లో) ఇవ్వబడతాయి. ఏమైతేనేం ఓ రోజున -

*"రిజల్ట్సు వచ్చాయి"*

హడావిడే హడావిడి "సీతా నీ నంబరుందేవ్" ఒకే అరుపు అరిచాడు పార్వతీశంగాడు వీధిలోంచే.

"మళ్ళీ చూడరా.. నా నంబరు 16588" అన్నాను.

"చూశానే. అందరూ పాసయ్యాం.. మొత్తం మన పాక బడి బేచ్ అంతా" గంతులేస్తూ అరిచాడు.

అందరం పరిగెత్తాం ఏలియా మాస్టారి దగ్గరికి. ఆయన సంతోషంతో వెక్కెక్కి ఏడుస్తుంటే, వాళ్ళ బాబు (చిన్నపిల్లాడు) ఇంతింత కళ్ళతో ఆశ్చర్యంగా చూస్తున్నాడు. వాళ్ళావిడ కళ్ళల్లోనూ ధారగా కన్నీళ్ళే. `ఆనంద భాష్పాలు` అంటే అర్థం ఆనాడు తెలిసింది. "ముందు నా దగ్గరికి వచ్చారేంట్రా పిల్లలూ. నేను చిన్న పంతుల్ని" సద్దుకున్నాక అన్నారు ఏలియా మాష్టారు.

"మాకు అక్షర భిక్ష పెట్టింది మీరే కదా మాస్టారూ" అని నేను పాద నమస్కారం చేశా. అందరూ నన్ననుసరించారు.

స్కూల్‌కి పోతే అక్కడ వీరన్నగారూ, పురుషోత్తంగారూ, సుబ్బారావుగారూ, ఆంజనేయులుగారు, పి.ఎస్.ఎన్‌గారు అందరూ చెమ్మగిల్లిన కళ్ళతో మమ్మల్ని అభినందించారు.

"స్కూలుకి గొప్ప పేరు తెచ్చార్రా. 85% పాస్ అంటే చరిత్రే మరి" అన్నారు హెడ్ మాస్టారు. మా గుండెలు గర్వంతో నిండిపోయాయి. గురువులకందరికీ పాద నమస్కారాలు చేశాం.

"ఒసే పెదపాడు మా లక్ష్మి కూతురా.. ఫో.. నీ కూతురు ఎస్సెల్సీ బ్రహ్మాండంగా పాసైంది. బుద్ధిగా పిండివంటలు చేసి పెట్టుకో. నీ కూతురు అలాంటిలాంటిది కాదు" కాలరెగరేస్తూ అన్నా. మా నాన్న మొహం అంతా నవ్వుతో నిండిపోయింది.

"పోవే భడవకానా!. ఇంతటితో ఏమైందీ.." మెటికలు విరిచి దిష్టి తీస్తూ అన్నది మా అమ్మ - మా అమ్మ కళ్ళలో చెమ్మ.

నిజంగానే నేనన్నమాట నిజమైంది. స్కూలు ఫస్టేకాదు, స్టేట్ సెకెండ్ హయ్యస్ట్ స్కోరర్ కూడా నేనేనని మార్కుల లిస్టు వచ్చాక తెలిసింది.

"ఎంత పిచ్చిదాన్ని. ఏదో పిచ్చి సంబంధం వస్తే, అర్జంటుగా నీకు పెళ్ళి చేద్దామనుకున్నా. సీతా, నువ్వింకా చదవాలే. చదివి చదివి గొప్పదానివైతే, అందరూ నన్ను చూపించి ఆవిడే సీత తల్లి అంటుంటే కళ్ళారా చూడాలనీ, చెవులారా వినాలనీ వుందే" అన్నది మా అమ్మ నన్ను గట్టిగా కావలించుకుని.

స్నేహితులారా.. నిజంగా నాకు మాటలు రావడంలేదు. బొటబొటా నా కళ్ళల్లోంచి కూడా కన్నీళ్ళు వస్తే బాగుండుననిపించింది, కానీ రాలేదు. నా తలమీద ఓ చేయిపడ్డది అప్పుడు. అది మా నాన్నదని నాకు తెలుసు. మెల్లగా నా తల నిమురుతూ మా నాన్న నన్ను దగ్గరికి తీసుకున్నాడు. నా తలమీద అక్షింతల్లాగా ఆయన కన్నీళ్ళు పడటం మాత్రం నాకు తెలుసు.

ఓ ఆకాశమా.. ఆ క్షణాన్ని అలాగే మరోసారి నాకు తిరిగి ఇవ్వవూ?

**మీ మూడో సీత.**

నా మాట

*మూడో సీత కథ (బాల్యం)*

*పాఠకులకి నమస్కారం. నేను పుట్టక ముందు స్త్రీల పరిస్థితులు ఎటువంటివోగానీ, నాకు ఊహ తెలిసిన దగ్గర్నించీ చూస్తున్న విషయాలు మాత్రం నా మనసులో చెక్కు చెదరకుండా యధాతథంగా వున్నాయి.*

*అప్పటి స్త్రీలు మగవారికి (భర్తలకి) పరమ బానిసలనో, వారికసలు నోరు తెరిచే స్వాతంత్ర్యం లేదనో చాలామంది ఆధునిక మహిళలు అనుకోవడం విన్నాను. ఆ మాట నిజమే. కానీ నూటికి నూరుపాళ్ళు సత్యం కాదు. 10% కరెక్టు. ఆర్థిక స్వాతంత్ర్యం లేదనేది మాత్రం నూటికి నూరుపాళ్ళూ కరెక్టే. అలాగని వారికి అన్ని మార్గాలూ మూసుకుపోలేదు. `పాడి` వున్నవారు పాలు పెరుగు వెన్న అమ్మి సంపాయించేది స్త్రీ ధనమే. ఆ స్త్రీ ధనాన్ని ముట్టుకోవడం మగవాళ్ళు `చిన్నతనం`గా భావించేవారు. ఒకవేళ భర్తలు అటువంటి ధనాన్ని*

వాడితే, మిగతావారందరూ అటువంటి భర్తల్ని హేళనగా చూసేవారు. కనక కొంత ఆర్థికమైన వెసులుబాటు వుండేది. ఇక బ్రాహ్మణుల ఇళ్ళల్లో అయితే, విస్తళ్ళు, కొబ్బరి చీపుళ్ళు ఆర్థికపరమైన వెసులుబాటుకి మార్గాలు. అయితే అటువంటి వెసులు బాటుని ఉపయోగించుకునే బ్రాహ్మణ స్త్రీలని వేళ్ళమీద లెక్కబెట్టొచ్చు.

స్త్రీకి ఇప్పటికంటే ఆ రోజుల్లోనే ఎక్కువ గౌరవం లభించేదని ఘంటాపథంగా చెప్పగలను వివాహితురాలైన స్త్రీని ఎంతో గౌరవంగా చూసేవారు. స్త్రీల మాటకి కుటుంబంలో విలువ ఖచ్చితంగా ఉండేది. మగవాడి 'అహం' ఆ విషయాన్ని బయటికి చెప్పకపోయినా, నిర్ణయాలు తీసుకునేప్పుడు మాత్రం స్త్రీల సలహాల్ని పరిగణనలోకి తీసుకునేవారు. ఇది నేను స్వయంగా చిన్నతనం నించీ గమనించిన మాట. ఆ రోజుల్లో నేటిలా వీధికి పది 'బార్లు' వైన్‌షాపులూ లేవు. పైగా తాగేవాళ్ళని చూసి అసహ్యించుకునేవారు. కొండొకచో తాగుబోతులకి భయపడేవారు.

ఒక విధంగా తాగుబోతుని ఇండైరెక్ట్ 'వెలి' వేసేవారు. మా 'సారంగధర' మామయ్య అనేవాడు "ఒరే, ఆ దేవదాసు సినిమా వొచ్చి జనాన్ని చెడగొట్టిందిరా. ప్రతివాడూ ప్రేమించాననడం, సారా పాకలకి పోయి మందుకొట్టడం ఖర్మ కాకపోతే తాగుడినీ, తాగుబోతునీ గ్లామరైజ్ చెయ్యడమేమ్మిటా" అని.

ఆయన అదృష్టం బాగుండి ప్రసాదాలు (ప్రభుత్వ సారాయి దుకాణాలు) వీధికో బారు సంక్షేమ పథకాలూ చూడలేదు. డ్రింకింగ్ అనేది సోషియలైజేషన్‌కి మారుపేరుగా మారుతుందని ఆయన ఊహలో కూడా ఉండివుండదు. ఇక వస్త్రధారణ. అఫ్‌కోర్స్ ఇది వ్యక్తి స్వాతంత్ర్యానికి సంబంధించిన విషయం. కానీ వ్యక్తి రిప్రజంట్ చేసేది వ్యవస్థనేగా!

ఆనాటినించీ నేటివరకు జరిగిన అనేకానేక మార్పుల్ని అక్షరరూపంలో పెట్టాలనే నా ఆశే, 'మూడోసీత'గా మారింది. వెయ్యేళ్ళలో లేని మార్పులు కేవలం గత 65 సంవత్సరాల్లో జరిగాయి. కట్టెపొయ్యినించి ఎలెక్ట్రిక్ ఓవెన్‌ల దాకా వచ్చిన మార్పులకి నేనేకాదు మీలోనూ ఎందరో సాక్షులం. మూడో సీత 'కల్పిత' వ్యక్తికాదు. కొంచెం అహం, కొంత పెంకితనం సీతకి పుట్టుకతో వచ్చిన గుణాలు. అద్భుతమైన గ్రాహక శక్తేకాదు, పరిస్థితులకి అనుగుణంగా తనని తాను మలుచుకోవడం భగవంతుడు ఆమెకిచ్చిన అపురూపమైన వరం. సరే -

మూడోసీత బాల్యం పూర్తయింది. ఆమె స్నేహితుల్లోని వారంతా ఇప్పుడూ ఉన్నారు. ఒకరిద్దరు తప్ప. పద్దెనిమిది నెలలుగా మూడోసీతని మీ సీతగా అక్కున చేర్చుకున్న మీ అందరికీ తలవొంచి నమస్కరిస్తూ, మరి మూడో సీత 'యవ్వనం'లోకి ప్రవేశిద్దామా!

మీ భువనచంద్ర

(మళ్ళీకలుద్దాం)

Post your comments